క్లుప్తంగా

చెన్నూర్ మాల మహానాడు అధ్యక్షుడిగా నర్సింహులు



నర్సింహులును సన్మానిస్తున్న మాల కులస్తులు

మందమర్రిరూరల్: పట్టణానికి చెందిన పల్లె నర్సింహులు చెన్నూర్ నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఊరు రామకృష్ణాపూర్‌లోని మాల కులస్తులు పల్లె నర్సింహులును శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కులాభివృద్ధికి పాటు పడుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బండ శ్రీనివాస్, పల్లెం మల్లేష్, బండ రవి, బోగె సురేష్, భీమ ఈశ్వర్, బోగే నరేష్, కాటం రమేష్, భీమ మధుకర్, కిరణ్ తదితరులు ఉన్నారు.

బాల్క సుమన్‌కు ఓటు వేస్తామని ఏకగ్రీవ తీర్మానం



పింఛన్ ప్రొసీడింగులతో దివ్యాంగులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లిలో ప్రభుత్వ విప్, నియోజకవర్గ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు ఓటు వేసి గెలిపిస్తామని దివ్యాంగులు బుధవారం తీర్మానం చేశారు. దివ్యాంగులకు సర్పంచ్ లక్ష్మిప్రియ, ఎంపీటీసీ శ్రీనివాస్ దివ్యాంగులకు పెరిగిన పింఛన్ ప్రొసీడింగులను అందజేశారు.

'బీఆర్ఎస్‌కు అండగా నర్సింగాపూర్ వాసుల తీర్మానం'

జైపూర్: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలోని నర్సింగాపూర్ గ్రామ ప్రజలు బీఆర్ఎస్‌కి మద్దతు తెలుపుతూ బుధవారం ఏకగ్రీవంగా ప్రజాప్రతినిధుల సమక్షంలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుచ్చమ్మ, ఎంపీటీసీ స్వాతి, నాయకులు రాజన్న, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

దేవరావు కుటుంబాన్ని ఆదుకోవాలి

జన్నారం: కంటిచూపు కోల్పోయి అనారోగ్యం బారిన పడి మృతి చెందిన ఇంద్రవెల్లి మండలం డొంగర్‌గావ్ గ్రామానికి చెందిన దేవరావు కుటుంబాన్ని ఆదుకోవాలని ఏఐసీసీ రిసర్చ్ డిపార్టుమెంట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వినోద్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్ ఆ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో వెండి కళ్లను తీసుకెళ్లడంతోనే, గ్రామంలో ఈ సమస్య ఏర్పడినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారని ఆరోపించారు. దీంతో ఆ గ్రామానికి చెందిన ఇద్దరికి కళ్లుపోయినట్లు, కంటి చూపు పోయిన వారిలో దేవరావు మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేపై డొంగర్‌గావ్ గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారని, ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయకుండా పోలీసులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా పోలీసులు వెంటనే ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాష్‌రెడ్డి, ఫసీఉల్లా, ప్రభుదాస్, ఇమ్రాన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసు'

మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్: మైనర్లు వాహనాలు నడిపితే, వాహనం ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆల్ఫోన్సా పాఠశాలలో బుధవారం సైబర్ క్రైమ్, ఉమెన్ సేఫ్టీ, రోడ్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్యార్థులు చిన్ననాటి నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ముఖ్యంగా వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్ల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై అశోక్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని ఒర్రెగడ్డ ఏరియాలో గల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సైబర్‌మోసాలపై సీఐ మహేందర్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో రాఖీ కట్టించుకుని, వృక్షాలకు రాఖీ కట్టారు.

అధికారులతో సమీక్ష

కాసిపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో ఎంఏ అలీం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామపంచాయతీలో 750మొక్కలు నాటుతూ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, గ్రామ పంచాయతీ బృందాలు గృహలక్ష్మి దరఖాస్తులు ఈ నెల 31లోపు పరిశీలించి, ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని, గ్రామాల్లో శానిటేషన్, క్లోరినేషన్ సక్రమంగా చేపట్టాలని సూచించారు.

అవినీతిపై గరంగరం..!

- కమిషనర్ కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపణ
- నిరసన వ్యక్తం చేసిన అధికార, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు
- అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

నస్పూర్: మున్సిపాల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం మున్సిపాల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన జనాగమ నర్సయ్య అనే కార్మికుడి మృతి పై రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎజెండాలో పొందుపరిచిన 28అంశాలపై చర్చించారు. 4వ వార్డు కౌన్సిలర్ బెడిక లక్ష్మి తన వార్డులో అక్రమ కట్టడాలు, నిర్మాణాలు చేపడుతున్నారని పలుమార్లు కమిషనర్, తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడంలేదని నేలపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు బేర సత్యనారయణ, బొౌతు లక్ష్మి, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సురిమిల్ల వేణు, కౌన్సిలర్లు బొద్దున సంధ్యారాణి, శీపతి సుమతి, తెనుగు లావణ్య, గెల్లు రజిత ఆమెకు మద్దతుగా సమావేశాన్ని బహిష్కరించి బయటకొచ్చారు. అనంతరం ఎజెండాలో పొందుపరిచిన 28అంశాలలో 27అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన

కమిషనర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తూ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సురిమిల్ల వేణు, బేర సత్యనారాయణ, బెడిక లక్ష్మి మాట్లాడుతూ.. నస్పూర్ మున్సిపాలిటీ అవినీతికి నిలయంగా మారిందని, కమిషనర్ కమీషన్ల కమిషనర్‌గా మారాడని ఆరోపించారు. అక్రమాలు జరుగుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్తే, ఎవరితోనైనా చెప్పుకోండి అనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పట్టణ పరిధిలోని 42, 64, 119, 72సర్వే నంబర్ ప్రభుత్వ భూముల్లో, టీఎన్జీవోస్ సొసైటీ కాలనీలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారి వద్ద డబ్బులు తీసుకుని, వాటిపై కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డు పనులు, తప్పుడు బిల్లులు పెట్టి అధిక నిధులు కాజేస్తున్నారని దుయ్యబట్టారు.

అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు...

మున్సిపల్ కమిషనర్ రమేశ్ అవినీతికి పాల్పడుతున్నారని మున్సిపాల్‌లో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపి, కమిషనర్ రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు బేర సత్యనారాయణ, బెడిక లక్ష్మి, బొౌతు లక్ష్మి, కాంగ్రెస్ కౌన్సిలర్లు సురిమిల్ల వేణు, బొద్దున సంధ్యారాణి, శీపతి సుమతి, గెల్లు రజిత, తెనుగు లావణ్య ఐడీఓసీలో అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఆరోపణలు అవాస్తవం

నా పై కౌన్సిలర్లు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. 4వ వార్డులో అక్రమ నిర్మాణాలు తొలగించడానికి కమిటీ వేసినట్లు, తహసీల్దార్ అందుబాటులో లేని కారణంగా నిర్మాణాల తొలగింపు ఆలస్యమైనట్లు తెలిపారు. సీసీసీ కార్నర్ చౌరస్తా జాతీయ రహదారి వెడల్పునకు అడ్డుగా ఉన్న టేలాలను తొలగించేందుకు ప్రయత్నించగా, కౌన్సిలర్ బేర సత్యనారాయణ అడ్డుతగిలి టేలాలను ఎలా తొలగిస్తారని అడిగారని, టేలాలను తొలిగించడానికి ప్రయత్నం చేసినందునే తనపై అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. బిల్లుల విషయంలో తాను ఏ విచారణకైనా సిద్ధమేనన్నారు. పలు నిర్మాణాల తొలగింపునకు కోర్టు కేసులు అడ్డుగా మారాయని తెలిపారు.

- టీ.రమేశ్, కమిషనర్

సాదాసీదాగా మంచిర్యాల మున్సిపల్ మీటింగ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజయ్య

మంచిర్యాలటౌన్: మున్సిపల్ సాధారణ సమావేశాన్ని బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పెంట రాజయ్య, కమిషనర్ మారుతి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సమావేశంలో ఎజెండాలోని 12అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పలు వార్డుల్లో రూ.56.50లక్షలతో అభివృద్ధి పనులతో పాటు, పట్టణ ప్రగతి నిధులు రూ.60లక్షలతో పనులను చేసేందుకు ఆమోదం తెలిపారు. ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో పారిశుధ్య పనులను చేపట్టేందుకు గాను తాత్కాలిక పద్ధతిలో 20మంది కార్మికులను రెండు నెలలకు గాను తీసుకునేందుకు రూ.6లక్షలకు కౌన్సిల్ ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్ కె.విజయ్‌కుమార్, మున్సిపల్ ఇంజనీర్ పి.మధుకర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బి.శ్యాంసుందర్, హెల్త్ అసిస్టెంట్ ఆర్.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట బల్దియా సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న చైర్మన్ కాంతయ్య

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లు, మండపాల వద్ద నిర్వాహకులు పాటించే నియమాలను చర్చించారు. స్వచ్ఛ ఆటోల రిపేర్లు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు గురించి తీర్మానం చేసి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు ఇన్‌చార్జి కమిషనర్ రాజశేఖర్, మేనేజర్ శ్రీహరి సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడిగా బెల్లంపల్లి మున్సిపల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ శ్వేత

బెల్లంపల్లి: మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై చర్చించి పరిష్కరించాలని సభ్యులు కోరారు. భవిష్యత్‌లో పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని తీర్మానం ఆమోదించారు. కొంతమంది సభ్యులు మున్సిపల్ రెవెన్యూ అధికారిని ప్రభుత్వానికి సరేండర్ చేయాలని కోరుతూ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

సమస్యలున్నా చర్చించకుండానే...

మున్సిపాలిటీలో అనేక సమస్యలు ఉన్నా, అవి చర్చించకుండానే మమా అనిపించారు. నెలకోసారి నిర్వహించే సమావేశానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నా, సభ్యులు అంతగా దృష్టిసారించకుండా సమావేశాన్ని ముగించడంపై విమర్శలు వస్తున్నాయి. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్, కమిషనర్ కె.సమ్మయ్య, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, ఆర్ఓ ఆర్.భుజంగరావు, ఏఈఈ సందీప్, టీఓ ఆశ్రిత్, సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



మైలారంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నెన్నెల: పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మైలారంలో రూ.12లక్షల ఏసీడీపీ, ఎమ్మెల్యే నిధులతో నిర్మించే సీసీ రోడ్డుకు బుధవారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు తెలంగాణ సర్కార్ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ఇటీవల రూ.6కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులను నెన్నెల మండలానికి మంజూరు చేశామన్నారు. నియోజకవర్గానికి రూ.30కోట్లు సీసీ రోడ్లు, బీటీ రోడ్ల కోసం మంజూరయ్యాయని త్వరలోనే పనులు మొదలు పెడతామన్నారు. అభివృద్ధిని చూసిన ప్రజలు మూడోసారి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించనున్నారని ప్రజలు ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, వైస్ ఎంపీపీ సుమలత, సర్పంచ్ లక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొమ్ముగూడెంను సందర్శించిన ఎమ్మెల్యే

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ గ్రామపంచాయతీ పరిధి కొమ్ముగూడెం గ్రామాన్ని బుధవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సందర్శించారు. సమస్యలపై ఆరా తీశారు. బీటీ రోడ్డును, చెరువుపై ఉన్న విద్యుత్‌లైన్‌ను నెల రోజుల్లో పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. భీమన్న గుడికి వెళ్లే రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తానని గ్రామస్తులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. సర్పంచ్ దాగం శంకరమ్మ, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

షీటీమ్ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

మంచిర్యాలక్రైం: షీ టీమ్ పోలీసులు షాడో(నీడ)లా ఉంటూ మహిళలకు రక్షణ కల్పిస్తోందని స్థానిక మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో షీ టీమ్, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించడమే షీ టీమ్ కర్తవ్యమన్నారు. మహిళలు ఏదైనా సమస్యల్లో, ఇబ్బందుల్లో గాని ఉన్నప్పుడు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో సైబర్ క్రైం నేరగాళ్లు మహిళలను, బాలికలను టార్గెట్ చేసి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా పరిచయాలు ఏర్పడి చివరికి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, బాలికలు ఎవరైనా ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, వేధింపులు ఎదుర్కుంటే వెంటనే 100డైల్‌కు గాని, షీ టీమ్ వాట్సాప్6303923700 నంబర్‌కు సమాచారం అందించినట్లైతే పూర్తి స్థాయి భద్రత ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా షీ టీమ్ ఎస్సై హైమ, సిబ్బంది సతీష్, శ్రావన్‌కుమార్, జ్యోతి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

అధికారిని అభినందించిన జీఎం

నస్పూర్: సింగరేణి సంస్థలో శ్రీరాంపూర్ ఏరియా ఐఈడీ విభాగంలో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా, ఎస్ సి లైజనింగ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న కిరణ్‌కుమార్ ప్రతిష్టాత్మక ఇంపాక్ట్ ఫౌండేషన్‌లో వ్యక్తిత్వ శిక్షణా నిపునుడిగా శిక్షణ పొంది సర్టిఫికేట్ పొందిన సందర్భంగా ఆయనను బుధవారం జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి అభినందించారు. కార్యాక్రమంలో డీజీఎంలు చిరంజీవులు, అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నస్పూర్: సింగరేణి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 3న పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద చేపట్టిన కార్మిక దీక్షకు సంబంధించిన పోస్టర్లను సీసీసీలో నస్పూర్ పట్టణ కన్వీనర్ ఎస్.రమేశ్ నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. దీక్షకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు మిట్టపల్లి మొగిళి, కాసెట్టి నాగేశ్వర్‌రావు, కొండ వెంకటేశ్, శ్రీనివాస్, శ్రీకాంత్, రాజు, విజయ్, కార్మికులు పాల్గొన్నారు.

రేపు జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థలో నెలకొన్న కార్మిక సమస్యలపై వచ్చే నెల 1న ఏరియా జీఎం కార్యాలయాల ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. ఏరియాలోని గనులపై బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్నా కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో కార్మికులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట యూనియన్ నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, బానయ్య, సంపత్, మల్లయ్య, దినేష్, కుమార్ తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



జైపూర్: మాట్లాడుతున్న సీఐ రమేశ్‌బాబు

జైపూర్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమైందని శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం జైపూర్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా జైపూర్ ఎస్సై ఉపేందర్‌రావు, శ్రీరాంపూర్, భీమారం ఎస్సైలు రాజేశ్, రాజవర్ధన్‌తో కలిసి శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబు పాల్గొని సరైన వాహనపత్రాలు లేని 30బైక్‌లు, 10ఆటోలను సీజ్ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్లకు, మెసేజ్‌లకు, వాట్సప్ కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాలను నివారించడానికి తోడ్పాటు అందించాలన్నారు.

'నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్'



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

కోటపల్లి: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ పోగ్రాం చేపడుతున్నట్లు సీఐ విద్యాసాగర్ అన్నారు. మల్లంపేటలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ పోగ్రాంలో భాగంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించి 35ద్విచక్ర వాహనాలతో పాటు 2ఆటోలు సీజ్ చేసినట్లు వివరించారు. స్పెషల్ పార్టీ, టీఎస్‌పీఎస్సీ పోలీసులతో ప్రాణహిత సరిహద్దు ప్రాంతాలతో పాటు మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లోని కల్వర్టులను తనిఖీ చేసినట్లు తెలిపారు. గ్రామంలో ప్రస్తుత పరిస్థితులను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల భద్రత పోలీసుల బాధ్యత అని, అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు సురేశ్, సుబ్బారావు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సమస్యలు పరిష్కరించాలని వినతి

చెన్నూర్: ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేసినట్లు సరోజ తెలిపారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు లక్ష్మి, సంతోషి, లలిత, కళావతి, స్వప్న, రాజేశ్వరి, నాగమణి, ఉమాదేవి పాల్గొన్నారు.

'పూడికతీత పనులు షురూ'

భీమిని: కన్నెపల్లి మండలంలోని పీపీ రావు ప్రాజెక్టు కాలువ పూడికతీత పనులు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదేశాల మేరకు కన్నెపల్లి జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ ఆధ్వర్యంలో మెట్‌పల్లి గ్రామ సర్పంచ్ లక్ష్మి బుధవారం ప్రారంభించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

దండేపల్లి: బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని దండేపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ అనిల్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ చంద్రకాంత్ అన్నారు. బ్యాంకు ఆవరణలో ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. బ్యాంకు సేవలు, రుణాలు, భీమా పథకాల గురించి వివరించారు.

రక్తదానానికి ముందుకు రావాలి

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంకులో రక్త నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని, దాతలు స్పందించి, రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

జైపూర్: మండల సర్వసభ్య సమావేశం బుధవారం కోరం లేక వాయిదాపడింది.

ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

నెన్నెల: పౌర హక్కులకు భంగం కలిగించొద్దని డెప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, నెన్నెల ఎస్సై శ్యాంపటేల్ పేర్కొన్నారు. మండలంలోని మైలారంలో పౌరహక్కులపై అవగాహన కల్పించారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): చట్టంలోని హక్కులు ప్రతి ఒక్కరికీ వర్తిస్తాయని, ఆ హక్కులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సమాజంలో అంతా మేలు జరుగుతుందని హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హాజీపూర్ మండలం దొనబండలో ఎస్సై మాట్లాడారు. గ్రామంలో కుల, మత విభేదాలకు తావులేకుండా సమానత్వంతో వ్యవహరించాలని, సమాజంలో ప్రతిఒక్కరూ సమానులేనని గుర్తు చేశారు.

'ధ్రువపత్రాల కోసం నేరుగా సంప్రదించండి'

మందమర్రిరూరల్: ప్రజలు వారికి కావాల్సిన ధ్రువపత్రాల కోసం దళారులను ఆశ్రయించకుండా నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించుకుందాం

చెన్నూర్: ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకుందామని ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. స్థానిక ముదిరాజ్ కాలనీలో బుధవారం ముదిరాజ్ కులస్తుల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు.

'రొడ్డ రమేష్ వర్ధంతి'

కాసిపేట: మండలంలోని దేవాపూర్ నాయకపుగూడలో బుధవారం ఆదివాసీ అమరుడు రొడ్డ చిన్న రమేష్ వర్ధంతిని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ ఆచార సంప్రదాయాల ప్రకారం విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు.

పాఠశాలల్లో రక్షాబంధన్



మంచిర్యాలఅర్బన్: శ్రీ చైతన్య పాఠశాలలో...



దండేపల్లి: కేజీబీవీలో చెట్లకు రాఖీ కడుతూ...



ఎస్సై, పోలీస్ సిబ్బందికి రాఖీలు కడుతూ...



రామకృష్ణాపూర్: రాఖీలు కడుతున్న విద్యార్థులు



భీమారం హైస్కూల్‌లో...



రాఖీ కడుతున్న చిన్నారి

చెన్నూర్/చెన్నూర్‌రూరల్/మంచిర్యాలఅర్బన్/లక్సెట్టిపేట/దండేపల్లి/రామకృష్ణాపూర్/తాండూర్/భీమారం/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తుగా రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టారు. మంచిర్యాలలోని అభ్యాస పాఠశాలలో విద్యార్థుల వినూత్న ప్రదర్శన ఆకట్టుకుంది. 500మంది విద్యార్థులు రాఖీ ఆకారంలో కూర్చొని పండుగ విశిష్టతను చాటిచెప్పారు. కొన్నిచోట్ల వృక్షాలకు రాఖీ కట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొమ్మెర జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో...



రాఖీ ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన



చెన్నూర్‌లోని కృష్ణవేణి పాఠశాలలో...



లక్సెట్టిపేట: రాఖీలు కడుతున్న చిన్నారులు